సాక్షి
నిర్మల్

బుధవారం । 27 । సెప్టెంబర్ । 2023

నిమజ్జనానికి తరలుతున్న
భజరంగ్‌యూత్ గణేశ్



ఎన్నికలు బహిష్కరిస్తాం

కడెం: ఏళ్లుగా తమ ఊరి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోనందున త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించాలని మండలంలోని అల్లంపల్లి, బాబానాయక్ తండా వాసులు నిర్ణయించారు. ఈ మేరకు పంచాయతీ తీర్మానం చేసి రెండు రోజుల్లో ఎంపీడీవోకు అందజేస్తామని సర్పంచ్ రంభాదేవి తెలిపారు. అటవీ అనుమతులు ఇచ్చినా ప్రభుత్వం కనీసం రోడ్డు కూడా వేయడం లేదని ఆరోపించారు.

గరిష్టం/కనిష్టం
31.3/24.6

వాతావరణం

ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. తుపాను ప్రభావంతో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

గంగమ్మ ఒడికి... గౌరీపుత్రుడు



శోభాయాత్రగా నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు









శోభాయాత్రలో ఎంపీ సోయం బాపూరావు

- భైంసాలో నిమజ్జన శోభాయాత్ర
- ఉదయం 10 గంటలకు ప్రత్యేక పూజలు..
- ఆకట్టుకున్న యువతీ యువకుల నృత్యాలు, మహిళల కోలాటం
- దారిపొడవునా గణనాథులకు భక్తుల పూజలు
- 'గడ్డెన్నవాగు'లో ఘనంగా నిమజ్జనం
- భారీగా పోలీసు బందోబస్తు..

భైంసా/భైంసాటౌన్:అందరి దృష్టిని ఆకర్షించే భైంసా గణేశ్ నిమజ్జనం మంగళవారం ఆధ్యాత్మిక వాతావరణం మధ్య ప్రారంభమైంది. ఉదయం 10 గంటలకు భట్టిగల్లిలోని మున్నూరుకాపు సంఘ భవనంలో గణేశునికి పూజలు చేసి శోభాయాత్ర ప్రారంభించారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవార్ రామారావుపటేల్, భోస్లే మోహన్‌రావుపటేల్, ఉత్సవకమిటీ అధ్యక్షుడు విలాస్ గాదేవార్, ప్రధాన కార్యదర్శి ముష్కం రామకృష్ణగౌడ్‌తోపాటు పలువురు పూజల్లో పాల్గొన్నారు. గణేశునికి సామూహిక హారతి అనంతరం శోభాయాత్ర ప్రారంభమైంది. జిల్లా అధికారులను మున్నూరుకాపు సంఘ భవనంలో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. శోభాయాత్ర పొడవునా ఉత్సవ కమిటీ సభ్యులంతా సేవలు అందిస్తున్నారు.

ఆకట్టుకున్న నృత్యాలు...

గణేశ్ శోభాయాత్రలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రామారావుపటేల్, మోహన్‌రావు పటేల్ యువకులతో కలిసి నృత్యాలు చేసి వారిని ఉత్సాహపరిచారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు సైతం నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. గణేశ్ మండళ్ల సభ్యులు, యువకులు, చిన్నారులు నృత్యాలు చేస్తూ నిమజ్జనోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కోర్టు గణేశ్ మండలి ఆధ్వర్యంలో జడ్జి దేవేంద్రబాబు, న్యాయవాదులు గణేశుని విగ్రహాన్ని గడ్డెన్నవాగు ప్రాజెక్టు వరకు శోభాయాత్రగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. యువజన, కుల సంఘాలు ప్రతిష్ఠించిన వినాయకుల ముందు కాషాయరంగు చొక్కాలు, కండువాలతో యువకులు స్టెప్పులు వేస్తూ కనిపించారు. శోభాయాత్ర ప్రారంభంలోనే గంటపాటు వర్షం కురిసింది. వర్షంలో తడుస్తూనే శోభాయాత్ర సాగింది. ఎప్పటిలాగే హాతి గణేశ్ మండలి భజనలు చేస్తూ శోభాయాత్రలో పాల్గొంది.

గడ్డెన్నవాగులో నిమజ్జనం..

ఉదయం 11 గంటల నుంచే బాలగణేశ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణేశ్ విగ్రహాలను గడ్డెన్నవాగు ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు. నిమజ్జన ఘాట్‌లో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి గణనాథునికి హారతి ఇచ్చి నిమజ్జనం ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక్కొక్కటిగా చేరుకున్న విగ్రహాలను నిమజ్జనం చేశారు.



గణనాథునికి పూజలు చేస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, నాయకులు

అన్నదానాలు, ప్రసాదాల పంపిణీ..

నిమజ్జన శోభాయాత్ర పురస్కరించుకుని పలు కుల, యువజన, ఇతర సంఘాల ఆధ్వర్యంలో దారిపొడవునా అన్నదానం, ప్రసాదం, మంచినీటి పంపిణీ చేశారు. లక్ష్మీనర్సింహ యోగ సమితి, కురుమ సంఘం, ఓంకార్ యూత్, విశ్వకర్మ సొసైటీ, లింగాయత్ సమాజ్, పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అన్నదానం, పులిహోర పంపిణీ చేశారు.

భారీగా బందోబస్తు..

భైంసాలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా భారీగా పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ స్థానికంగానే ఉండి భద్రతను పర్యవేక్షిస్తున్నారు. శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సూచనలు చేస్తున్నా రు. సమస్యాత్మక ప్రాంతాలు, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలతో నిమజ్జన దృశ్యాలను కమాండ్ కంట్రోల్‌రూం ద్వారా వీక్షించారు. డ్రోన్, వీడియో కెమెరాలతో నిమజ్జన దృశ్యాలను చిత్రీకరిస్తున్నారు.



భట్టిగల్లిలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్



తెప్పపై గణేశులను తరలిస్తున్న జాలరి



నృత్యం చేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు



గణనాథుని నిమజ్జనానికి తరలిస్తున్న మహిళలు..

భైంసా అభివృద్ధికి కేరాఫ్ కావాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి, వేదికపై ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఏఎస్పీ పాటిల్, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి..

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి

భైంసాటౌన్:భైంసా పట్టణంలో మూడేళ్లుగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదని, ఇదే స్ఫూర్తితో పండుగలు, ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. గణేశ్ నిమజ్జనోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని భట్టిగల్లి మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గతంలో జరిగిన కొన్ని ఘటనలతో రాష్ట్రస్థాయిలో భైంసా సున్నిత ప్రాంతంగా పేరు పొందిందని తెలిపారు. దీంతో ఇక్కడి ప్రజల జీవనస్థితిగతులు, వ్యాపారాలు, ముఖ్యంగా యువతపై ప్రభావం పడుతోందని వెల్లడించారు. శాంతియుత వాతావరణం కొనసాగించడం ద్వారా భైంసా పట్టణం అభివృద్ధికి కేరాఫ్‌గా మారుతుందని తెలిపారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. పండుగల సందర్భంగా సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లు నమ్మొద్దన్నారు. అవాంఛనీయ ఘటనలు జరిగితే పోలీసుల దృష్టికి తేవాలన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి కేసులపాలు కావొద్దని సూచించారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవార్ రామారావుపటేల్, భోస్లే మోహన్‌రావు పటేల్, ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు తదితరులు మాట్లాడారు. ఆర్డీవో కోమల్‌రెడ్డి, హిందూఉత్సవ సమితి అధ్యక్షుడు విలాస్‌గాదేవార్, కార్యదర్శి రామకృష్ణాగౌడ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బాశెట్టి రాజన్న, ఏఎంసీ మాజీ చైర్మన్ పి.కృష్ణ, తోట రాము, తూం దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు.

మహిళా చైతన్యానికి ప్రతీక ఐలమ్మ

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



ఐలమ్మ విగ్రహం ఆవిష్కరిస్తున్న ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: తెలంగాణ సాయుధ పోరాటంలో బడుగు బలహీనవర్గాల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన చాకలి ఐలమ్మ మహిళా చైతన్యానికి ప్రతీక అని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కొనియాడారు. స్వరాష్ట్రంలో నాటి పోరాట యోధులకు సముచిత గౌరవం దక్కుతున్నదన్నారు. మంగళవారం చాకలి ఐలమ్మ 128 జయంతిని జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మయూరి హోటల్ ఎదుట చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించి, పుష్పాంజలి ఘటించారు. అంతకుముందు మంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి విగ్రహం వరకు నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం దోబీ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. పీడిత ప్రజల కోసం పోరాటం చేసిన మహిళ చాకలి ఐలమ్మ అన్నారు. ఐలమ్మ జయంతి, వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని వెల్లడించారు. రజకుల కోసం జిల్లా కేంద్రంలోని ధర్మసాగర్ కట్ట వద్ద రూ.2కోట్లతో ధోబీఘాట్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. అక్కడే మడేల్ మహారాజ్ ఆలయం నిర్మిస్తామన్నారు. అనంతరం మామడ మండలం గాయిద్‌పల్లి గ్రామానికి చెందిన 70 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాజేందర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అల్లోల మురళీధర్‌రెడ్డి, పాకాల రాంచందర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు రాము, మున్సిపల్ విప్ వేణు, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చందుల ఊషన్న, పట్టణ అధ్యక్షుడు పెద్ద బాలరాజ్, ప్రధాన కార్యదర్శి ఐలాపురం శంకర్, సభ్యులు నిమ్మల వెంకటరమణ, గంగాధర్, చందుల చరణ్, నిమ్మల రాజశేఖర్, రాజులదేవి శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె నోటీసు



నోటీసు ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్:ఈనెల 27లోపు ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకపోతే 28 నుంచి సమ్మెకు వెళ్తామని మధ్యాహ్న భోజన కార్మికులు తెలిపారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ)ఆధ్వర్యంలో మంగళవారం డీవో కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడుతూ జీవో 8 ప్రకారం వేతనాలను ఏరియర్స్‌తో సహా చెల్లించి పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. కొత్త మెనూను సవరించాలని కోరారు. మధ్యాహ్న భోజన నిర్వహణను అక్షయ పాత్ర లాంటి స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వొద్దని సూచించారు. గుడ్డుకు అదనంగా బడ్జెట్ కేటాయించాలన్నారు. వంటగ్యాస్ సబ్సిడీపై ఇవ్వాలని కోరారు. వంట పాత్రలు తదితర మౌలిక వసతులు కల్పించి సామాజిక భద్రత కల్పించాలన్నారు. ప్రమాద బీమా, పీఎఫ్ , ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

'కానుక'లొస్తున్నాయ్..!

- జిల్లాకు చేరుతున్న బతుకమ్మ చీరలు
- ఇప్పటికే గోదాంలకు 1,81,960 చీరలు



సారంగపూర్ గోదాంలో బతుకమ్మ చీరలు

నిర్మల్‌చైన్‌గేట్: బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రభుత్వం ఏటా అందించే కానుకలు జిల్లాకు చేరుకుంటున్నాయి. పండుగ ప్రారంభానికి ముందే పంపిణీ చేసేలా ఈ ఏడాది కూడా ఏర్పాట్లు చేస్తోంది. 18 ఏళ్లు నిండిన మహిళలు జిల్లాలో 2,78,352 మంది ఉండగా.. ఈ ఏడాది జిల్లాకు 2,78,352 చీరలు అవసరమని జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదించారు. గతేడాదిలాగే ఈ ఏడాది కూడా జిల్లాకు అంతే సంఖ్యలో ప్రభుత్వం కేటాయించింది. జిల్లాకు చేరుతున్న ఈ కానుకలను అధికారులు గోదాముల్లో నిల్వ చేయిస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాకు 2,49,500 చీరలు వచ్చాయి. అక్టోబర్ మొదటి వారంలో పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు.

మండలాల వారీగా పంపిణీ..

చీరలను ప్లాస్టిక్ బండిళ్లలో ప్యాక్ చేసి ఉంచారు. ఒక్కో బండిలో 160 చీరలు ఉంటాయి. చీరల పొడవులో రెండు రకాలుగా ఉండనున్నాయి. 6.60 మీటర్ల పొడవు చీరలు కొన్ని, 9 మీటర్ల పొడవు చీరలు కొన్నింటిని జిల్లాకు కేటాయించారు. కడెం మండల సమాఖ్యకు 6.5 మీటర్స్ చీరలు 17 వేలు, 9 మీటర్ల చీరలు 1,550, ఖానాపూర్ మండల సమాఖ్యకు 6.5 మీటర్ల చీరలు 8 వేలు, 9 మీటర్ల చీరలు 1,750, మామడ మండల సమాఖ్యకు 6.5 మీటర్ల చీరలు 10 వేలు, 9 మీటర్ల చీరలు 11,750, లక్ష్మణచాంద మండల సమాఖ్యకు 6.5 మీటర్ల చీరలు 11 వేలు, 9 మీటర్ల చీరలు 1,710, దిలావర్‌పూర్ మండల సమాఖ్యకు 6.5 మీటర్ల చీరలు 11 వేలు, 9 మీటర్ల చీరలు 5,350, సారంగపూర్ మండల సమైక్యకు 6.5 మీటర్ల చీరలు 8,400, 9 మీటర్ల చీరలు 2,600, ముధోల్ మండల సమాఖ్యకు 9 మీటర్ల చీరలు 2600, భైంసా మండల సమాఖ్యకు 6.5 మీటర్ల చీరలు 25 వేలు, లోకేశ్వరం మండల సమాఖ్యకు 6.5 మీటర్ల చీరలు 12 వేలు, 9 మీటర్ల చీరలు 1,100, కుభీర్ మండల సమాఖ్యకు 6.5 మీటర్ల చీరలు 15 వేలు, 9 మీటర్ల చీరలు 1,350, నిర్మల్ మున్సిపాలిటీకి 6.5 మీటర్ల చీరలు 27 వేలు, 9 మీటర్ల చీరలు 2,400 చేరాయి.

గోదాములకు చీరలు..

ఈ చీరలను భద్రపరిచేందుకు అధికారులు జిల్లాలో 11 గోదాములను ఏర్పాటు చేశారు. నిర్మల్ మున్సిపాలిటీతోపాటు ఆయా మండలాల పరిధిలోని మండల సమాఖ్య గోదాముల్లో చీరలను నిల్వ చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాకు చేరిన చీరలను గోదాముల్లో భద్రపరిచారు. చీరల నిల్వలు, పంపిణీని డీఆర్డీవో, డీఆర్డీఏ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. గ్రామ స్థాయిలో చీరల పంపిణీ బాధ్యతను పంచాయతీ కార్యదర్శి, మహిళా సంఘం, రేషన్ షాపు డీలర్లు చేపట్టనున్నట్లు తెలిసింది. ఇక అర్బన్ ప్రాంతాల్లో వార్డుకు సంబంధించిన బిల్ కలెక్టర్, వార్డులోని మహిళా సంఘం సభ్యులు, రేషన్ షాపు డీలర్లు పంపిణీ చేయనున్నారు. పంపిణీకి సంబంధించి నాలుగు రోజుల ముందుగా రేషన్ షాపుల వారీగా శిక్షణ ఇస్తారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఆధారంగా లబ్ధిదారులను గుర్తిస్తారు. 18 ఏళ్లు దాటి, అంత్యోదయ అన్నయోజన కార్డు కలిగిన మహిళలు కూడా ఈ పథకానికి అర్హులే.

న్యూస్‌రీల్

28, 29 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్లకు వెబ్ ఆప్షన్

నిర్మల్ రూరల్:ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా ఈనెల 28, 29 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్లకు బదిలీ వెబ్ ఆప్షన్స్ కల్పిస్తున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన కేటగిరీ దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు ఎడిట్ ఆప్షన్ 30న ఉంటుందన్నారు. స్పౌజ్ పాయింట్స్ వాడుకునే ఉపాధ్యాయులు, తమ స్పౌజ్ పనిచేస్తున్న పాఠశాల దగ్గరగా ఉండే పాఠశాలలను మాత్రమే ఆప్షన్స్‌గా ఎంచుకోవాలని సూచించారు. విద్యాశాఖ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే వారికి బదిలీ ఉత్తర్వులు ఇస్తారన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

కుభీర్: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను సెక్టోరియల్ అధికారి శ్రీదేవి మంగళవారం తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని సూచించారు. 10 జీపీఏతో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ వాణి ఉన్నారు.

గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి



నిమజ్జన ర్యాలీలో భజన చేస్తున్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌టౌన్: గణేశ్ నిమజ్జనం, శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన కర్ర గణపతి నిమజ్జన శోభాయాత్రను మంగళవారం ప్రారంభించారు. అంతకుముందు గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఆకోజి కిషన్, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల మానవహారం



ర్యాలీగా వస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

నిర్మల్‌చైన్‌గేట్:జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ ఉద్యోగులు చేస్తు న్న సమ్మె మంగళవారం 16వ రోజుకు చేరింది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ ఉద్యోగులు జిల్లా కేంద్రంలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూని యన్ జిల్లా అధ్యక్షురాలు రాజమణి, ఉపాధ్యక్షులు శైలజ, శశికళ, లావణ్య, రమ్య, దేవిక, ఏఐటీయూసీ అనుబంధ సంఘం సభ్యులు రమ, ప్రేమల, హేమలత పాల్గొన్నారు.

జూడోలో క్రీడాకారులు సత్తా



క్రీడాకారులతో ఎస్జీఎఫ్ జిల్లా సెక్రెటరీ రమణారావు

నిర్మల్‌టౌన్: ఆదిలాబాద్‌లో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జోనల్‌స్థాయి జూడో పోటీలో నిర్మల్ జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఇందులో పర్వతాల మౌక్షి బంగారు పతకం, శ్రీవర్షిన్య వెండి, కృష్ణవేణి కాంస్య పతాకాలు సాధించారు. వీరిని ఎస్జీఎఫ్ జిల్లా సెక్రెటరీ రామారావు, పెటా అసోసియేషన్ సభ్యులు భూమన్న, జూడో సంఘం జిల్లా అధ్యక్షుడు సాయికిరణ్, సెక్రెటరీ శివ, ఉపాధ్యక్షుడు స్వామి, కోచ్ రాజు అభినందించారు.

విద్యార్థులకు పోటీలు

నిర్మల్ రూరల్: వరల్డ్ టూరిజండే ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో శివాని, మహీం, హర్షిత, రుచిత, ముస్కాన్ బేగం విజేతలుగా నిలిచారు. ఉపన్యాస పోటీల్లో మైత్రి, ప్రార్థన, హర్షిత బహుమతులు గెలుచుకున్నారు. చిత్రలేఖనంలో తనుశ్రీ, లాస్య, స్పందన విజేతలుగా నిలిచారు. డీవైఎస్‌వో నాఫెఖాన్, రవీంద్ర, వనజ, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు లోక్‌సభ స్పీకర్ అభినందన లేఖ


సంతోష్‌కుమార్

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం బేదోడ్కర్ సంతోష్ కుమార్ సెప్టెంబర్ 5న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. కాగా, సంతోష్‌కుమార్‌ను అభినందిస్తూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పోస్టు ద్వారా లేఖ పంపించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఇద్దరిలో మీరు ఒకరు కావడం పాఠశాల, రాష్ట్రానికి గర్వకారణమని ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల ఉన్నతికి, విద్యార్థుల చదువుకు మీరు చేస్తున్న కృషి అభినందనీయమని అందులో సంతోషకుమార్‌ను కొనియాడారు. ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లి ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయాలని సూచించారు. కాగా, లోక్‌సభ స్పీకర్ సంతోష్‌కుమార్‌కు అభినందన లేఖ పంపడంపై మండల ఉపాధ్యాయులు, నిపాని గ్రామస్తులు హర్షం వ్యక్తంజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: డిప్లొమా ఇన్ ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీలో అడ్మిషన్ల కోసం గిరిజన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైటెక్‌సిటీ, మాదాపూర్, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఇంపర్టింగ్ ఒకేషనల్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీలో శిక్షణ పొందగోరే వారు 18–35 ఏళ్లలోపు ఉండాలని, 60 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులు కావాలని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు అక్టోబర్ 5లోపు సంబంధిత గిరిజన సంక్షేమాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


రెండుతలల దూడ జననం


రెండు తలల దూడ

లోకేశ్వరం: మండలంలోని బాగాపూర్ గ్రామానికి చెందిన ఆర్షప్రసాద్ అనే రైతుకు చెందిన గేదె మంగళవారం రెండు తలల దూడకు జన్మనిచ్చింది. ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తన గేదె ఈనే లక్షణాలు గమనించిన ప్రసాద్ పశువైద్యుడికి సమాచారం ఇచ్చాడు. ఎంతకూ గేదె ఈనక పోవడంతో వైద్య సిబ్బంది వెంటనే గేదె గర్భం నుంచి ముగ్గురు వ్యక్తుల సాయంతో దూడను బయటకు తీశారు. కాగా, ఆ దూడ రెండు తలలతో వింతగా ఉంది. దీంతో గ్రామస్తులు రెండు తలల దూడను చూసేందుకు ప్రసాద్ ఇంటికి క్యూకట్టారు. అయితే పుట్టిన వెంటనే ఆ దూడ మరణించిందని రైతు ప్రసాద్ తెలిపాడు. ఈ విషయమై లోకేశ్వరం పశువైద్యాధికారి జెస్సీని వివరణ కోరగా.. జన్యుపరమైన లోపంలో ఇలాంటి దూడలు పుడుతాయని, ఇవి ఎక్కువ కాలం జీవించవని పేర్కొన్నారు.

ఆధునికీకరణతోనే మనుగడ

- భారీ వరదలకు కడెం ప్రాజెక్టుకు ముప్పు
- పరిస్థితిపై నివేదిక ఇచ్చిన అధికారులు
- ఎలాంటి చర్యలు చేపట్టని ప్రభుత్వం


కడెం ప్రాజెక్ట్

కడెం: ఉమ్మడి జిల్లాలోనే ప్రధాన సాగు నీటి ప్రాజెక్ట్ కడెం ద్వారా నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని కడెం, దస్తురాబాద్, జన్నారం, దండేపల్లి, హాజీపూర్, లక్సెట్టిపేట్ మండలాల్లోని సుమారు 70 వేల ఎకరాల అయకట్టుకు సాగు నీరందుతుంది. 1958లో ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయింది. అప్పుడు తొమ్మిది (జర్మనీ) వరదగేట్లు ఏర్పాటు చేశారు. అయితే ప్రాజెక్ట్ నిర్మించిన మొదటి ఏడాది వానాకాలం సీజన్‌లోనే భారీ వరదలు రావడంతో కొట్టుకుపోయింది. ఆ తర్వాత ప్రాజెక్ట్‌కు అదనంగా మరో తొమ్మిది వరద గేట్లు ఏర్పాటు చేశారు. 1980లో భారీ వరదలు వచ్చిన ఎలాంటి ముప్పు వాటిల్లక పోగా, 1995లో, గతేడాది జూలై 13న వచ్చిన వరదలతో ప్రాజెక్ట్ దెబ్బతింది. మళ్లీ ఈ ఏడాది జూలై 21న వచ్చిన భారీ వరదలు వచ్చినపుడు గేట్లు మొరాయించడంతో ప్రాజెక్ట్ తెగిపోయే పరిస్థితి వచ్చింది.

డీసీఆర్‌పీ సూచనలు అమలయ్యేనా?

రెండేళ్లుగా భారీ వరదలతో అతలాకుతలమవుతున్న కడెం ప్రాజెక్ట్ ప్రాజెక్ట్ స్థితిగతులను అధ్యయనం చేయడానికి జూలైలో సీడబ్ల్యూసీ, డీసీఆర్‌పీ బృందాలు కడెం ప్రాజెక్ట్‌ను పరిశీలించాయి. ప్రాజెక్ట్ సామర్థ్యానికి మించిన వరదలు వస్తున్నాయని, క్రాప్ హాలీడే ఇవ్వకుండా ప్రస్తుతం ఉన్న ప్రాజెక్ట్‌ను అలాగే ఉంచి, సుమారు ఆరు లక్షల ఔట్ ఫ్లో సామర్థ్యంతో ప్రాజెక్ట్ ముందే నూతన ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టాలని లేదా ప్రాజెక్ట్‌కు అదనపు గేట్లు ఏర్పాటు చేయాలని, జర్మనీ గేట్ల ఎత్తు పెంచాలని పలు సూచనలతో కూడిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా డీసీఆర్‌పీ నివేదిక సాధ్యాసాధ్యాలను పరిశీలించేందు మెకానికల్ బృందాన్ని కడెంకు పంపింది. నూతన ప్రాజెక్ట్ నిర్మాణామా? అదనపు గేట్లు ఏర్పాటు చేయడమా? అనేది ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

కర్రగణేశుని దర్శనానికి భక్తుల తాకిడి


ఆలయ ఆవరణలో భక్తులు

కుభీర్: మండలంలోని సిర్పెల్లి సరిహద్దు నుంచి రెండు కిలో మీటర్ల దూరంలోని మహారాష్ట్ర లోగల పాలజ్ కర్రగణేశుని దర్శనానికి మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ప్రజలు, తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి భక్తులు మంగళవారం అధిక సంఖ్యలో వచ్చారు. దర్శనానికి 3గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.

దారులన్నీ పాలజ్ వైపే..

మండలంలోని కుభీర్, పల్సి, నిగ్వా గ్రామాల మీదుగా భక్తులు పాలజ్ కర్రగణేశుని దర్శనానికి వెళ్తున్నారు. ఈ గ్రామాల్లోని ఏరోడ్డును చూసినా పాలజ్‌కు వెళ్లే కార్లు, ఆటోలు, బైక్‌లు కనిపించాయి. సిర్పెల్లి సరిహద్దు వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. చాలామంది భక్తులు కాలినడకన కూడా వెళ్తున్నారు.

మోదీ సభకు లక్ష జనసమీకరణ

- బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వెల్లడి
- నిజామాబాద్ ఉమ్మడి జిల్లా, నిర్మల్, జగిత్యాల జిల్లాల పదాధికారుల సమావేశం


ఏర్పాట్లు పరిశీలిస్తున్న కిషన్‌రెడ్డి, లక్ష్మీనర్సయ్య, సూర్యనారాయణ, నాయకులు

సుభాష్‌నగర్: అక్టోబర్ 3న జిల్లా కేంద్రంలో జరిగే ప్రధాని మోదీ బహిరంగ సభను జయప్రదం చేసేలా ప్రతి కార్యకర్త పని చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. మంగళవారం నగరంలోని బస్వాగార్డెన్స్‌లో ఉమ్మడి నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాల పదాధికారుల సమావేశాన్ని నిర్వహించారు. సభకు జన సమీకరణ, వివిధ అంశాలపై రాష్ట్ర, జిల్లాల నాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. 3న నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో ప్రధాని మోదీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. సభ నుంచి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారని పేర్కొన్నారు. సభకు జిల్లాల నుంచి లక్ష మందికిపైగా ప్రజలను సమీకరించాలని సూచించారు. అధికారిక కార్యక్రమం అయినప్పటికీ బహిరంగ సభతో ప్రధాని మోదీ ఎన్నికల ప్రచార సభకు శ్రీకారం చుడతారని తెలిపారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో బీజేపీ కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలో అన్ని స్థానాల్లో కాషాయ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, దక్షిణ తెలంగాణలోనూ పార్టీ బలపడుతోందని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, ఎంపీ అర్వింద్ ధర్మపురి, మాజీ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, అరుణ తార, ఆయా నియోజకవర్గ నాయకులు ధన్‌పాల్ సూర్యనారాయణ, దినేశ్ కులాచారి, మల్లికార్జున్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, డాక్టర్ వెంకట్, సత్యనారాయణ, కార్పొరేటర్లు, నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే మేము..

- ఎమ్మెల్యే బాపూరావు పార్టీ మారడం ఆయన వ్యక్తిగతం
- తేల్చిచెప్పిన పార్టీ స్థానిక నాయకులు


మాట్లాడుతున్న సంధ్యారాణి, నాయకులు

బోథ్: ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు పార్టీ మారినా.. తాము మాత్రం బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతామని స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు స్పష్టం చేశారు. జెడ్పీటీసీ సంధ్యారాణితో పాటు పలువురు నాయకులు మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే బాపూరావు పార్టీ మారడం ఆయన వ్యక్తిగతమన్నారు. సీఎం కేసీఆర్ బోథ్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా అనిల్ జాదవ్‌ను ప్రకటించారని, ఆయన్నే తాము ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామన్నారు. ఎవరికైనా పార్టీతోనే గుర్తింపు వస్తుందన్నారు. ఇందులో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు తాహెర్ బిన్ సలాం, బోథ్ సర్పంచ్ సురేందర్ యాదవ్, సొనాల సర్పంచ్ సదానందం, ఆత్మ చైర్మన్ సుభాష్, గ్రంథాలయం జిల్లా డైరెక్టర్ రమణగౌడ్, యూత్ ప్రెసిడెంట్ ప్రవీణ్, రఫీ, నాయకులు తదితరులున్నారు.

అయోమయంలో బాపూరావు అనుచరులు..

తనకు టికెట్ కేటాయించకపోవడంపై పార్టీ అధిష్టానంపై ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ గుర్రుగా ఉన్నారు. ఈ క్రమంలోనే త్వరలో తన రాజీనామా ప్రకటిస్తానని ఆయన ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఆయనతో పాటు స్థానికంగా రాజీనామా చేసి వెళ్లేది ఎవరనేది చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యేతో వెళ్లాలా..? లేక పార్టీలోనే ఉండాలా..? అని ఆయన అనుచరులు అయోమయానికి గురవుతున్నారు. కాగా, ఆయనకు అత్యంత సన్నిహితంగా ఉన్న నాయకులు మాత్రం బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతామని పేర్కొనడం గమనార్హం.

జల్సాల కోసం చోరీ

- సొంత బాబాయి ఇంటికే కన్నం
- రూ.2 లక్షలు, బంగారం అపహరణ
- 48గంటల్లో ఛేదించిన పోలీసులు


నిర్మల్‌లో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

లక్ష్మణచాంద: జల్సాలకు అలవాటు పడిన ఓ వ్యక్తి సొంత బాబాయికి ఇంటికే కన్నమేసి చివరికి పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన హలీమా బేగం భర్త బషీర్ దుబాయి వెళ్లాడు. హలీమా బేగం ఈనెల 22న తన తమ్ముడు ఫరీద్ ఇంట్లో ఫంక్షన్ ఉండగా బాబాపూర్ నుంచి ముటాపూర్‌కు వెళ్లింది. మరుసటిరోజు ఇంటికి చేరుకున్న ఆమె బీరువా పగులగొట్టి ఉండడాన్ని గమనించి చోరీ జరిగినట్లు గుర్తించింది. బీరువాలోని రూ.75వేల నగదు, నాలుగు తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై శ్రీకాంత్ దర్యాప్తు చేపట్టారు. సోమవారం మండలంలోని న్యూకంజర్ నుంచి లింగంపల్లి గ్రామానికి వెళ్లేదారిలో బైక్‌పై ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకుని విచారించారు. కాగా, తన పేరు అల్లహుద్దీన్ అని, మూడురోజుల క్రితం తన బాబాయి బషీర్ ఇంట్లో చోరీ చేసింది తానేనని అంగీకరించాడు. దీంతో అతడిని అరెస్ట్ చేసి రూ.75వేలు, నాలుగు తులాల బంగారు ఆభరణాలు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ గంగారెడ్డి మంగళవారం విలేకరులకు వెల్లడించారు. చోరీ జరిగిన రెండు రోజుల్లోనే వేగంగా దర్యాప్తు చేసి నిందితుడిని పట్టుకున్న సోన్ సీఐ నవీన్‌కుమార్, లక్ష్మణచాంద ఎస్సై శ్రీకాంత్, పీసీలు సునీల్, కిరణ్, గణేశ్, దిలీప్‌ను నిర్మల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అభినందించారు. నిందితుడిని నిర్మల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి జైలుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

30న గిరిజనుల సమావేశం


మాట్లాడుతున్న మెస్రం వెంకట్‌రావ్

ఇంద్రవెల్లి: ఈ నెల 30న కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో గిరిజనుల సమావేశం నిర్వహించనున్నట్లు కేస్లాపూర్ రాయిసెంటర్ సార్‌మెడి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు. మంగళవారం మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని కొమురంభీం విగ్రహం ఆవిష్కరణ, జీవో నంబర్ 3, ఉద్యమ కార్యాచరణపై సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. తొమ్మిది తెగల ఆదివాసీ సంఘాల నాయకులు, రాయిసెంటర్‌ల సార్‌మెడిలు, పటేల్, ఆయా గ్రామల పెద్దలు తరలిరావాలని కోరారు. నాయకులు వెట్టి రాజేశ్వర్‌పటేల్, కినక శేకు, మెస్రం బాదిరావ్, మెస్రం నాగ్‌నాథ్, కోట్నాక్ భారిక్‌రావ్, మెస్రం దుర్గు, తొడసం సాగర్, హెరేకుమ్ర మధు ఉన్నారు.

హౌసింగ్‌బోర్డు కాలనీలో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన రిటైర్డ్ ఉద్యోగి కిష్టు కొద్దినెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రి ఖర్చుల కోసం బ్యాంక్ నుంచి రూ.1.06లక్షలు విత్‌డ్రా చేసి ఇంట్లో భద్రపరిచాడు. ఈ నెల 24న కుటుంబ సభ్యులతో కలిసి భీంసరి గ్రామానికి వెళ్లాడు. ఆయన బంధువు గణేశ్ 26న ఇంటి కిష్టు ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని చూసి అతడికి సమాచారం ఇచ్చాడు. కిష్టు ఇంటికి వచ్చి చూసి రూ.1.06 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాతకక్షలతో ఒకరి హత్య


ఇమ్రాన్ (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: పాతకక్షలతో ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. ఈ ఘటన సోమవారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని మోమిన్‌పుర కాలనీకి చెందిన షేక్ ఇమ్రాన్ (27)కు జమీర్, ఇర్ఫాన్‌తో పాత కక్షలున్నాయి. జమీర్, ఇర్ఫాన్ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉండి ఇమ్రాన్‌ను పిలిచారు. అక్కడికి వెళ్లిన ఇమ్రాన్‌ను గొంతు నులిమి కింద పడేశారు. ఈ క్రమంలో అటుగా వెళ్లిన ఇమ్రాన్ తమ్ముడు అమీర్ గమనించి అన్నను వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు రెఫర్ చేశారు. రిమ్స్‌కు తరలిస్తున్న క్రమంలో ఇమ్రాన్ మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య హీన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో యువకుడి మృతి


దిగంబర్ (ఫైల్)

బజార్‌హత్నూర్: మండలంలోని జాతర్ల గ్రామానికి చెందిన ఆత్రం దిగంబర్ (23) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దిగంబర్ తన మిత్రులతో కలిసి దేగామ గ్రామం నుంచి జాతర్ల గ్రామానికి బైక్‌పై వస్తున్న క్రమంలో గుండెపోటు వచ్చింది. వెంటనే అతడిని 108లో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకువచ్చేసరికి అప్పటికే మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సోన్: నిర్మల్ జిల్లా మేడిపెల్లి గ్రామానికి బంధువుల అంత్యక్రియలకు వెళ్లి తిరిగి బైక్‌పై వస్తున్న ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాక్‌పట్ల గ్రామానికి చెందిన సోమ రాజేశ్వర్ మంగళవారం మేడిపెల్లి గ్రామానికి వెళ్లాడు. తిరిగి బైక్‌పై సొంతూరికి వస్తున్నాడు. ఈ క్రమంలో కడ్తాల్ గ్రామంలోని రైతువేదిక దాటిన తర్వాత 44వ జాతీయ రహదారిపై ఆదిలాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజేశ్వర్‌కు తల, ఛాతి, ఇతర చోట్ల బలమైన గాయాలయ్యాయి. చికిత్స కోసం అతడిని ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. అతడి భార్య ప్రవళిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రైవర్ రాథోడ్ దయారాం బస్సును అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైనట్లు తెలుస్తోంది.

అడవిపంది బైక్‌ను ఢీకొని..

తాంసి: ద్విచక్రవాహనానికి అడవిపంది అడ్డు రాగా ఇద్దరు రైతులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. భీంపూర్ మండలం గొల్లఘాట్ గ్రామానికి చెందిన రాకేశ్, లక్ష్మణ్ మంగళవారం సాయంత్రం పంటచేలకు వెళ్లారు. తిరిగి ఇంటికివచ్చే క్రమంలో అడవిపంది ద్విచక్రవాహనానికి అడ్డు వచ్చి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కిందపడ్డ రాకేశ్ తలకు తీవ్ర గాయాలు కాగా, లక్ష్మణ్ చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108లో ఇద్దరిని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీలో మంగళవారం పేకాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. వారి నుంచి రూ.5,200 నగదు స్వాధీనం చే సుకున్నట్లు పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలి పారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌టౌన్: తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి యోగా పోటీలకు 16 మంది నిర్మల్ జిల్లా విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలోని మంత్రి కార్యాలయంలో వీరితోపాటు యోగా గురువులు మల్లేశ్, అన్నపూర్ణ, చంద్రశేఖర్‌ను మంగళవారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అభినందించారు. విద్యార్థులకు అన్ని రకాల సహాయ, సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఇందులో గోల్డ్ మెడల్ విభాగంలో అవినాష్, మనీశ్, రవీందర్, చరణ్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణంరాజు, యోగా గురువులు ప్రదీప్, సతీశ్, పురుషోత్తం, సుమిత్, పవిత్ర పాల్గొన్నారు.

గణేశ్ మండపంలో ముస్లింల అన్నదానం


భక్తులకు భోజనం వడ్డిస్తున్న ముస్లింలు

నేరడిగొండ: మండలంలోని వాంకిడి గ్రామంలోగల హనుమాన్ గణపతి మండపం వద్ద మంగళవారం ముస్లింలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాగా, గణపతి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని ముస్లింలు పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ అడిగం రాజు, గ్రామస్తులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసిన ముస్లింలను శాలువాలతో సన్మానించారు.

అన్యాయం జరిగిందని ఆత్మహత్యాయత్నం


పురుగుల మందు తాగి డబ్బా చూపిస్తున్న మల్లేశ్

దండేపల్లి: కొడుకు ప్రేమ పెళ్లి వివాదంలో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తమ కుటుంబానికి తీరని అన్యాయం చేశారని మండలంలోని మామిడిపల్లికి చెందిన చాతరాజు మల్లేశ్ మంగళవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. మల్లేశ్ కొడుకు సుమన్ ఏడాది క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొద్దిరోజులు బాగానే ఉన్న సుమన్ దంపతుల మధ్య కలహాలు మొదలయ్యాయి. ఈవిషయంలో గ్రామానికి చెందిన కొందరు తమ కోడలు పక్షాన నిలిచి తమను కేసుల పాలు చేశారని, దీంతో తాము తీవ్రంగా నష్టపోయామని, ఆస్తులు అమ్ముకున్నామని మల్లేశ్ స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట పోలీసులు, గ్రామస్తులతో వాపోయాడు. ఇదే క్రమంలో వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. వెంటనే అక్కడే ఉన్న ఎస్సై ప్రసాద్, సిబ్బంది అతడిని తమ వాహనంలో లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు రెఫర్ చేశారు. కాగా, లక్సెట్టిపేట ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటుండగా, స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ మల్లేశ్ వాంగ్మూలాన్ని తీసుకున్నారు.

కూతురిపై లైంగిక దాడి.. తండ్రికి 20 ఏళ్ల జైలు

ఆసిఫాబాద్: సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించి, కన్న కూతురుపై లైంగిక దాడికి పాల్పడిన తండ్రికి 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.6 వేల జరిమానా విధిస్తూ మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీవీ రమేశ్ తీర్పు వెలువరించారు. పీపీ జీవీఎస్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్ పట్టణంలోని జంజిరాల వెంకటి పదో తరగతి చదువుతున్న తన మైనర్ కుమార్తెను తరచూ లైంగికంగా వేధించేవాడు. ఈక్రమంలోనే 2022 జూలైలో ఇంట్లోనే లైంగికదాడికి పాల్పడ్డాడు. 2022 నవంబర్ 13 రాత్రి మరోసారి లైంగిక దాడికి యత్నించగా, బాలిక తల్లి వాణి దృష్టికి తీసుకెళ్లింది. వాణి కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ రవీందర్ పోక్సో కింద కేసు నమోదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేసి 14 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

రిటైర్డ్ కలెక్టర్ ఇంట్లో చోరీ

- రూ.2లక్షలు అపహరణ

జన్నారం: హైదరాబాద్ రిటైర్డ్ కలెక్టర్ శర్మన్‌నాయక్ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన మండలంలోని కలమడుగు పంచాయతీ పరిధి రాంనాయక్ తండాలో చోటు చేసుకుంది. రిటైర్డ్ కలెక్టర్ మనుమడు లావుడ్యా సాయిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కలెక్టర్‌గా ఉద్యోగ విరమణ పొందిన లావుడ్యా శర్మన్‌నాయక్ రాంనాయక్ తండాలో కుటుంబంతో నివాసముంటున్నాడు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఆయన కూతురు సుజాత, కుటుంబ సభ్యులు రాంనాయక్ తండాలోని తన నివాసంలో ఉంటున్నారు. రోజులాగే ఈనెల 25న రాత్రి 10 గంటలకు భోజనం చేసి నిద్రించారు. 26న ఉదయం 8గంటలకు సుజాత ఇల్లు శుభ్రం చేసేందుకు శర్మన్‌నాయక్ గది వద్దకు వెళ్లేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అనుమానంతో గదిలోకి వెళ్లి పరిశీలించగా రూ.2లక్షలు కనిపించలేదు. వెంటనే ఎస్సై సతీశ్‌కు సమాచారం ఇవ్వగా లక్సెట్టిపేట సీఐ కృష్ణ, ఎస్సై సతీశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఫింగర్ ప్రింట్‌లు సేకరించారు. సాయిప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

సహస్ర దీపోత్సవం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవరకోట దేవస్థానంలో మంగళవారం సహస్ర దీపోత్సవం, ఉయ్యాల సేవా కార్యక్రమం నిర్వహించారు. రాంచందర్ బృందం ఆధ్వర్యంలో సంకీర్తనలు ఆలపించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దీపాలు వెలిగించారు. అనంతరం తీర్థ ప్రసాదం వితరణ చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఆమెడ శ్రీధర్ పేర్కొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

కడెం: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీటీసీ కౌన్సిలర్ రాంచందర్, షూర్ ఎన్‌జీవో సభ్యుడు మల్లికార్జున్ అన్నారు. మంగళవారం మండలంలోని అంబారిపేట్ గ్రామంలో 150 మందికి ఉచిత హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు చేశారు. వ్యాధిగ్రస్తులు భయపడొద్దని.. వైద్యుల సూచనలతో పోషకాహారం తీసుకుంటూ దీర్ఘకాల జీవితం పొందవచ్చని అన్నారు. ఇందులో ల్యాబ్ టెక్నీషియన్ సాజిద్ అలీ, సర్పంచ్ లక్ష్మి, ఉప సర్పంచ్ ఎల్లయ్య ఉన్నారు.

పారిశుధ్యంపై అవగాహన


వెంకూర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారి

కుంటాల: మండలంలోని విఠాపూర్, వెంకూర్ గ్రామాల్లో మంగళవారం డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి మసార్‌రావు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, ఎంపీవో రహీం, సర్పంచులు లక్ష్మి, శృతి, కార్యదర్శులు అరుణ, కవిత, ఎఫ్ఏ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి పోటీలకు 'వాసవి' విద్యార్థి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 23న నిర్వహించిన జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీల్లో వాసవి వరల్డ్ పాఠశాల విద్యార్థి శ్రీనిష్ అండర్-14(44-46) కేజీల విభాగంలో ప్రతిభ కనబర్చి జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్ శైలజైసన్, సెక్రెటరీ జగదీశ్‌రెడ్డి, కోచ్ మణాళిని అభినందించారు.

భూమిపూజ

లోకేశ్వరం: మండలంలోని బిలోలిలో ఉపాధి నిధులు రూ.20 లక్షలతో నిర్మించే పంచాయతీ భవన నిర్మాణానికి మంగళవారం జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ భూమిపూజ చేశారు. వైస్‌ఎంపీపీ నారాయణ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, పీఆర్ జేఈ రఘువంశీ, సాయారెడ్డి, భుజంగ్‌రావు, శ్యాంసుందర్, నర్సింగ్‌రావు, ప్రశాంత్, అనిల్, ప్రభాకర్‌రావు, రాజు ఉన్నారు.

మహిళలకు వైద్యపరీక్షలు

కుంటాల: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మహిళలకు ఎనిమిది రకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తేజస్విని, అమృతయాని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

ఖానాపూర్: పట్టణంలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్ క్యాంపు కార్యాలయంలో కడెం మండలం కొత్త ధర్మాజీపేటకు చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా జాన్సన్‌నాయక్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్లాస్టిక్‌ను వినియోగించొద్దు

సారంగపూర్: స్వచ్ఛతా హీ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై వివేకానంద పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రత్నాకర్‌రావు మాట్లాడుతూ ప్లాస్టిక్‌కు బదులు పేపర్ బ్యాగులను వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో గీతా రమణారావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉద్యమ నాయకులకు సన్మానం

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని పోస్టల్ శాఖలో మంగళవారం రజాకార్లకు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో పాలు పంచుకున్న ఇద్దరు ఉద్యమకారులను ఘనంగా సన్మానించారు. మేరా మిట్టీ మేరా దేశ్‌లో భాగంగా స్థానికులైన కట్కం ముత్యంరెడ్డి, సంభ భోజరాంను సన్మానించారు. సర్పంచ్ వీరేశ్‌కుమార్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుస్మిత, నిరంజన్ రెడ్డి, శైలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

కుంటాల: మండలంలోని కల్లూర్ వాసవి కళాశాలలో ఇంటర్ చదివి అగ్నిపథ్‌కు ఎంపికైన విద్యార్థులు సాయికిరణ్, శివాజీ పటేల్‌ను మంగళవారం కల్లూర్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, ప్రిన్సిపాళ్లు సాయిలు, గట్టుపల్లి శ్రీనివాస్, డైరెక్టర్లు కడార్ల హరిప్రసాద్, జానకీరాం తదితరులు పాల్గొన్నారు.

సంబురంగా నిమజ్జనం


ఖానాపూర్‌లో గణేశుడి శోభాయాత్రలో భక్తుల కోలాటం


తానూరులో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


భైంసారూరల్: మహాగాంలో భక్తుల కోలాటం


లోకేశ్వరం: పంచగుడిలో భక్తులు


ఖానాపూర్‌లో పరిశీలిస్తున్న సీఐ మోహన్


లక్ష్మణచాంద: వద్యాల్‌లో ఎస్సై శ్రీకాంత్

తానూరు: తొమ్మిది రోజులపాటు విశేష పూజలు అందుకున్న గణనాథుడిని భక్తులు గంగమ్మ ఒడికి చేర్చారు. వీధుల గుండా నిర్వహించిన శోభాయాత్రలో నృత్యాలు చేస్తూ.. సందడిగా గడిపారు. మండల కేంద్రమైన తానూరుతోపాటు ఎల్వి గ్రామాల్లో మంగళవారం వినాయకుడి నిమజ్జనం కనుల పండువగా నిర్వహించారు.

ఖానాపూర్: పట్టణంలో ప్రధాన రోడ్డు వెంట డప్పుచప్పుళ్లు, డీజే చప్పుళ్ల నడుమ శోభాయాత్ర వైభవంగా సాగింది. అనంతరం స్థానిక గోదావరిలో నిమజ్జనం తంతు నిర్వహించారు. భక్తులు, నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన సీఐ

ఖానాపూర్‌లోని గోదావరి నది తీరం వద్ద నిమజ్జన ఏర్పాట్లను మంగళవారం రాత్రి మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, ఖానాపూర్ సీఐ మోహన్ పరిశీలించారు. మున్సిపల్ ఆధ్వర్యంలో క్రేన్ సౌకర్యంతోపాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. కమిషనర్ మనోహర్, రాసమల్ల రాజశేఖర్ ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని మహాగాం, సుంక్లి, బిజ్జూర్, కోతల్‌గాం, సిరాల, వాలేగాం గ్రామాల్లో మంగళవారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. అనంతరం సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై శ్రీకాంత్, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కుంటాల: మండలంలోని అంబకంటి, అంబకంటితండా, దౌనెల్లి, దౌనెల్లితండా, మెదన్‌పూర్, రాయపాడ్, పెంచికల్‌పాడ్ గ్రామాల్లో నిమజ్జనం నిర్వహించారు. సర్పంచ్‌లు హైమద్, ప్రదీప్‌కుమార్, శంకర్, బోజాబాయి, చంద్రకాంత్ పూజలు చేశారు. ఎస్సై హన్మాండ్లు, ఏఎస్సైలు దేవరావు, రాందాస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనం నిర్వహించారు. ఎలాంటి ఘటనలు జరగకుండా ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

మండల కేంద్రంలోని ఊర చెరువు వద్ద వాహనాలు దిగేందుకు సర్పంచ్ ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో పొక్లెయిన్‌తో చదును చేయించారు.

భైంసా: నిమజ్జనం నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బాసరలోని గోదావరి నదిపై ఏర్పాట్లు చేశారు. సీఐ వినోద్ రెడ్డి, ఎస్సై గణేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. సర్పంచ్ లక్ష్మణరావు తదితరులున్నారు.

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి, మన్మద్, రాజూర, గడ్‌చాంద గ్రామాల్లో నిమజ్జనం నిర్వహించారు. అంతకుముందు ఆయా గ్రామాల్లో వీడీసీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ప్రత్యేక రాష్ట్రంలోనే ఆలయాల అభివృద్ధి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి


పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి అల్లోల

సారంగపూర్: ప్రత్యేక రాష్ట్రంలోనే ఆలయాల అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర దేవాదాయ, న్యాయ, అటవీ పర్యావరణ శాఖమంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రూ.50 లక్షలతో నిర్మించే మార్కండేయ ఆలయం, రూ.26.5లక్షలతో నిర్మించే విఠలేశ్వర ఆలయం, రూ.20లక్షలతో నిర్మించే పెద్దమ్మతల్లి ఆలయాల పనులకు శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ కేవలం సారంగపూర్‌లోనే రూ.2.015కోట్లతో ఆలయాలు నిర్మించినట్లు పేర్కొన్నారు. హైలెవెల్ కాలువ ప్రస్తుతం దోనిగాం ప్రాజెక్టు వద్దకు చేరుకుందని.. త్వరలోనే దాన్ని స్వర్ణ ప్రాజెక్టులోకి తీసుకొచ్చి ప్రతి చెరువు నింపేలా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలను అందిస్తున్న కేసీఆర్‌ను మరోసారి సీఎం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మైనార్టీల చేరిక..

మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన 25మంది మైనార్టీలు, గ్రామ ఉపసర్పంచ్ అబ్దుల్ మజార్ మంత్రి అల్లోల సమక్షంలో బీఆర్‌ఎస్ నాయకులు కొత్తింటి మల్లేశ్, మాధవరావు, ఉట్ల రాజేశ్వర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, సారంగాపూర్ సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ సభ్యురాలు సామల పద్మ, పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, ఆలూరు, కౌట్ల(బి) పీఏసీఎస్ చైర్మన్ మాణిక్‌రెడ్డి, నారాయణరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మాధవరావు, రాజ్‌మహ్మద్, జీవన్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, నర్సారెడ్డి ఉన్నారు.

మంత్రికి సీఆర్టీల వినతి

సారంగపూర్: తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ సీఆర్టీలు, కాంట్రాక్టు లెక్చరర్లు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి మండల కేంద్రంలో వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన మంత్రి సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, కేజీబీవీ ఉపాధ్యాయులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

లక్ష్మణచాంద: మండలానికి చెందిన పలువురికి మంగళవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మంత్రి ఐకేరెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. లక్ష్మణచాందకు చెందిన బ్రహ్మదండి సాయిరాంకు రూ.17,500, బ్రహ్మదండి సంతోష్‌కు రూ.19వేలు, రాంపెల్లి నగేశ్‌కు రూ.50వేలు, మల్లాపూర్, పార్‌పెల్లి గ్రామాలకు చెందిన ఒక్కొక్కరికి చెక్కులు అందజేశారు. బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు కొరిపెల్లి క్రిష్ణారెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్, నరేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

మహావీర్‌తండాలో అదనపు కలెక్టర్ తనిఖీ


రికార్డులను తనిఖీ చేస్తున్న కిశోర్‌కుమార్

సారంగపూర్: మండలంలోని మహావీర్‌తండా గ్రామపంచాయతీని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. గ్రామపంచాయతీలో రికార్డులు పరిశీలించి కార్యదర్శి పనితీరు తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ప్రధాన రహదారులను పరిశీలించి పారిశుధ్యాన్ని పర్యవేక్షించారు. డంపింగ్‌యార్డు, సెగ్రిగేషన్‌షెడ్డు, పల్లె ప్రకృతివనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేసిన పంచాయతీ పాలకవర్గాన్ని అభినందించారు. సర్పంచ్ రాజేశ్, ఎంపీడీవో సరోజ, ఎంపీవో తిరపతిరెడ్డి, కార్యదర్శులు రాజేందర్, అశోక్, సుధాకర్ ఉన్నారు.

ఘనంగా గణపతికి పూజలు


పాతదిలావర్‌పూర్‌లో కర్ర వినాయకుడు


తానూరు: భోసిలో బారులు తీరిన భక్తులు


కుంటాలలో భక్తుల పూజలు

ఖానాపూర్: మండలవ్యాప్తంగా గణేశుడి మండపాల వద్ద అన్నదానాలు, కుంకుమ పూజలు కొనసాగుతున్నాయి. మంగళవారం పట్టణంలోని శివాజీనగర్, విద్యానగర్, రాజీవ్‌నగర్, ఇంద్రానగర్‌లో నిర్వహించగా.. భక్తులు వచ్చి పూజలు చేశారు.

పాతదిలావర్‌పూర్‌లో కర్ర వినాయకుడు..

మండలంలోని దిలావర్‌పూర్ పంచాయతీలోని పాతదిలావర్‌పూర్ గ్రామంలో కొలువుదీరిన కర్ర వినాయకుడు విశేష పూజలు అందుకుంటున్నాడు. నాలుగేళ్ల కిందట నిర్మల్‌కు చెందిన వజ్రాచారి అనే కళాకారుడు దీనిని తయారు చేశాడు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కర్ర వినాయకుని చెంతనే మట్టి వినాయక ప్రతిమను ఏర్పాటు చేసి నవరాత్రుల అనంతరం నిమజ్జనం చేస్తున్నారు. ఉత్సవాల అనంతరం కర్ర వినాయకుడిని గ్రామంలోని హనుమాన్ ఆలయంలో భద్రపరిచి వినాయక చవితికి తిరిగి ప్రతిష్ఠిస్తున్నారు.

కుంటాల: మండల కేంద్రంలో యువ యూత్ గణేశుడి మండపం వద్ద భక్తులు పూజలు చేశారు. ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో మిత్రమండలి సభ్యులు అన్నదానం చేశారు.

తానూరు: మండలంలోని భోసిలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయకుడిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. మహారాష్ట్రలోని పలు గ్రామాల నుంచి తరలివచ్చి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో కమిటీ గౌరవ అధ్యక్షులు నాగనాథ్, అధ్యక్షులు మురళి, సర్పంచ్ ఆనంద్, ఉత్తం బాలేరావ్ తదితరులు ఉన్నారు.

ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్దాం

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి
- ఊరూరా పోరాట యోధురాలి జయంతి


భైంసారూరల్: కామోల్‌లో ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, నేతలు


సోన్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


ముధోల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు


కుభీర్‌లో ..

భైంసారూరల్: చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్దామని ముధోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని మండలంలోని కామోల్ గ్రామంలో వీరనారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, ఎంపీటీసీ నర్సారెడ్డి, అమేందర్‌రెడ్డి, శ్రీను, రజక సంఘం నాయకులు శంకర్, ముత్యం, యోగేశ్, మహేశ్ తదితరులు ఉన్నారు.

సోన్: మండల కేంద్రంలోని ఐలమ్మ విగ్రహం వద్ద బీజేపీ నాయకులు, రజక సంఘం సభ్యులు నివాళులర్పించారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోశెట్టి, హరీశ్‌రెడ్డి, బాలకృష్ణ, అశోక్, రవి, నరేశ్, నర్సయ్య, హైమద్, అన్వేశ్ పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: మండల కేంద్రంతోపాటు కాల్వ గ్రామాల్లో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించారు. సర్పంచ్ జంగం వీరేశ్‌కుమార్, ఎంపీపీ పాల్దె అక్షర, ఎంపీటీసీ సభ్యురాలు గంగవ్వ రజక సంఘం సభ్యులు ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించారు.

ముధోల్: మండల కేంద్రంలోని ఐలమ్మ విగ్రహానికి రజకసంఘం సభ్యులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, అనిల్, పోతన్నయాదవ్, రమేశ్, పలువురు రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని సూర్యాపూర్, కుంటాలలో ఐలమ్మ జయంతి నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి, సర్పంచ్ బక్కి సునీత, రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని భోసిలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. సర్పంచ్ ఆనంద్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉత్తం బాలేరావ్, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

కుభీర్: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఐలమ్మ జయంతి నిర్వహించారు. వైస్ ఎంపీపీ మోహినొద్దీన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు అనిల్, ఉపసర్పంచ్ విక్రమొద్దీన్, విజయ్, రహూఫ్, ఈవో విజయ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో ఐలమ్మ విగ్రహానికి ప్రజాప్రతినిధులు, రజక సంఘం సభ్యులు నివాళులర్పించారు. జెడ్పీటీసీ చిన్నరామయ్య, సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ మల్లేశ్, సాయేందర్, కొండ్ర రమేశ్, గంగారెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ఐలమ్మ విగ్రహం వద్ద రజక సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సర్పంచ్ ముత్యంరెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని హవర్గ, గడ్‌చాంద, లోకేశ్వరం, రాజూర గ్రామాల్లో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. రాజూర సర్పంచ్ ముత్తగౌడ్, నాయకులు భోజారం, భూమన్న, నవీన్, భోజన్న, హరీశ్ పాల్గొన్నారు.

పంచాయతీ ట్రాక్టర్‌ను అడ్డుకున్న తండావాసులు


ట్రాక్టర్‌ను అడ్డుకున్న లక్ష్మీనగర్ తండావాసులు

లోకేశ్వరం: నెలరోజులుగా చెత్త సేకరించేందుకు రావడం లేదని పంచాయతీ ట్రాక్టర్‌ను అడ్డుకున్న ఘటన మండలంలోని సేవాలాల్‌తండా పంచాయతీలోని లక్ష్మీనగర్ తండాలో మంగళవారం చోటు చేసుకుంది. తండావాసులు మాట్లాడుతూ ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్నా.. తమ గ్రామంలో చెత్తాచెదారం పేరుకుపోయిందని.. అభివృద్ధి జరగడం లేదని వాపోయారు. ఈ సమాచారం తెలిసి పంచాయతీ కార్యదర్శి అశోక్ తండాకు వెళ్లి మాట్లాడారు. గత మూడు నెలలుగా డ్రైవర్‌కు ప్రభుత్వం జీతాలు ఇవ్వకపోవడంతో చెత్త సేకరించేందుకు ట్రాక్టర్‌ను తండాకు పంపలేదన్నారు. ఇప్పటినుంచి రోజు పంచాయతీ ట్రాక్టర్‌ను తడి,పొడి చెత్త సేకరించేందుకు పంపిస్తామనడంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు.

'హరితహారం నిధులు దుర్వినియోగం'

ఖానాపూర్: హరితహారం పథకం పేరిట మున్సిపల్ చైర్మన్ రాజేందర్ రూ.లక్షల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నాడని మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం ఆరోపించారు. మంగళవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణ పరిధిలో హరితహారానికి రూ.40లక్షల వరకు ఖర్చు చేశామని లెక్కలు చూపుతున్నా.. పట్టణంలో కనీసం పదుల సంఖ్యలో కూడా నాటిన మొక్కలు కన్పించడం లేదని విమర్శించారు. ప్రమాదాలు జరుగుతున్నా..పట్టణంలోని రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయడం లేదని వాపోయారు. నాయకులు, అధికారుల అవినీతి, అక్రమాలను బట్టబయలు చేసి వారికి గుణపాఠం చెబుతామని పేర్కొన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ఖానాపూర్: అధిక వర్షాలకు వాతావరణంలో తేమ శాతం పెరిగినందున.. వరిలో చీడపీడలు దరిచేరకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి ఆసం రవి అన్నారు. మంగళవారం మండలంలోని బీర్నంది, రంగపేట్ గ్రామాల్లోని పొలాలను ఏవో పరిశీలించి మాట్లాడారు. వరిలో మానిపండు తెగులు నివారణకు స్ప్రే డబ్బాకు 16 గ్రాముల ఇమామేక్టిన్ బెంజోయేట్ తోపాటు 40 గ్రాముల సాఫ్‌పొడర్, 50 గ్రాముల స్వర్ణఫల్ మందులు కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

కడెం: మండలంలోని నవాబ్‌పేట్, కల్లెడ గ్రామాల్లోని వరి పొలాలను మంగళవారం ఏఈవో సురేశ్ పరిశీలించారు. వరిలో ఆకుముడత తెగులు నివారణకు క్లోరోఫైరిఫాస్, లేదా కొరాజిన్ మందులను పిచికారీ చేసుకోవాలని సూచించారు. యూరియా వాడకం తగ్గించి, కాంప్లెక్స్ ఎరువుల వినియోగిస్తే పంటలను కాపాడుకోవచ్చని అన్నారు.

పనితీరు మార్చుకోకుంటే చర్యలు

- డీఆర్డీవో విజయలక్ష్మి
- ఉపాధి పనుల్లో రూ.58వేలు రికవరీ చేయాలని సిబ్బందికి ఆదేశం


మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

దస్తురాబాద్: ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పనితీరు మార్చుకోకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి.. చర్యలు తీసుకుంటామని డీఆర్డీవో విజయలక్ష్మి హెచ్చరించారు. పనుల్లో అక్రమాలు జరిగినందుకు రూ. 58వేలను రికవరీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలోని రైతువేదిక ఆవరణలో మంగళవారం దస్తురాబాద్ ఉపాధిహామీ సామాజిక తనిఖీ రెండో విడత ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో 2021 నవంబర్ నుంచి 2023 మార్చి వరకు చేపట్టిన ఉపాధి పనుల వివరాలను సామాజిక తనిఖీ సమన్వయకర్త కవితను అడిగి తెలుసుకున్నారు. మండలంలో రూ.2.68 కోట్లతో చేపట్టిన పనులపై వివరాలను వెల్లడించారు. మున్యాల పంచాయతీలోని పెద్దూర్‌కు చెందిన తలారి రాజం అనే వ్యక్తి మృతి చెందినా అతడు 84 రోజులు పనులు చేసి రూ.20,090 బిల్లు తీసుకున్నట్లు రికార్డుల్లో నమోదైంది. మున్యాలలోనే ఆశవర్కర్‌కు 122 రోజులు పని కల్పించి రూ.20,100 చెల్లించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మండలంలోని రేవోజీపేట, బుట్టాపూర్, మల్లాపూర్, గొడిసీర్యాల, పెర్కపల్లె, ఆకొండపేట గ్రామాల్లో వంద రోజులు చేసిన కూలీలకు డబ్బులు రాకపోవటం, మస్టర్లలో సంతకాల్లేకుండా బిల్లు చెల్లించటం, చెక్కులపై ఎంపీడీవో సంతకాలు లేకపోవడం వంటి తప్పులను గుర్తించారు.

బుట్టాపూర్‌లో జాబ్ కార్డు కోసం రూ.700 మేట్ వసూలు చేశారని కూలీ ఫిర్యాదు చేయడంతో సదరు మేట్‌ను తొలగించాలని డీఆర్డీవో ఆదేశించారు. తాము కల్లాలు నిర్మించుకుంటే బిల్లులు రాలేదని దస్తురాబాద్‌కు చెందిన ఆరుగురు రైతులు విన్నవించగా.. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఏపీవోపై ఆగ్రహం..

ఈజీఎస్ ఏపీవో రవిప్రసాద్‌పై దేవునిగూడెం సర్పంచ్ అంజన్న డీఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. పశువుల పాక నిర్మాణం కోసం గతేడాది దరఖాస్తు చేయకుంటే ఇప్పటికీ మంజూరు చేయలేదని విన్నవించారు.

అధికారులకు జరిమానా...

మండలంలో చేపట్టిన పనుల్లో అక్రమాలు జరిగాయని.. రూ.58,703లను రికవరీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మస్టర్లలో సంతకాల్లేకుండా బిల్లులు రికార్డు చేసినందుకు ఉపాధిహామీ సిబ్బందికి రూ.రెండు వేలు జరిమానా విధించారు. ఎంపీపీ సింగరి కిషన్, జెడ్పీటీసీ శారద, వైస్ ఎంపీపీ రాజునాయక్, సంతోష్, ఎంపీడీవోలు విజయ్‌భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, సుధాకర్, ఏపీవో లక్ష్మీనర్సయ్య, ఎంపీవో అనిల్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న సమ్మె


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిబ్బంది

సారంగపూర్/ముధోల్/కుంటాల/లక్ష్మణచాంద/నర్సాపూర్(జి): తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన సమ్మె మంగళవారం 16వ రోజుకు చేరింది. ముధోల్‌లో భైంసా-బాసర చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి, మండల కేంద్రానికి వచ్చిన కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కుంటాలలో చేపట్టిన అంగన్‌వాడీల సమ్మెకు ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, పసుల నవీన్, వెంకట్‌రావు, తాటి శివ తదితరులు మద్దతు తెలిపారు. లక్ష్మణచాందలో, నర్సాపూర్(జి)లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ సంఘం కార్యదర్శి లలిత, వెంకటలక్ష్మి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.